
# గంధం చెట్టు

గన్నవరపు నరసింహమూర్తి

*డియర్ మూర్తీ!*

వారం రోజుల నుంచీ నీతో మాట్లాడాలనీ ఎంతో ప్రయత్నం చేశాను. కానీ నీ నెంబరు నాకు తెలియకపోవడం వల్ల అది కుదరలేదు. మన ఫ్రెండ్స్ ఎవ్వరికీ కూడా నీ నెంబరు తెలియదుట. బహుశా క్రితంసారి నువ్విచ్చిన నెంబరు మారిపోయిందనుకుంటాను. ఈ మధ్యనే నువ్వు న్యూయార్క్ షిఫ్టయ్యావని శేషు చెప్పాడు. అతి కష్టం మీద నీ అడ్రస్ సంపాదించి నీకు ఈ ఉత్తరం రాస్తున్నాను. ఇక అసలు విషయానికొస్తే మన అయ్యర్ తెలుసు కదా?! అదే మన క్యాంటిన్ అయ్యర్. అతనికిప్పుడు ఓ పెద్ద సమస్య వచ్చిపడింది. మన యూనివర్సిటీ ఆవరణలో ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్న అతని హోటల్‌ని అక్కడ నుంచి ఎత్తెయ్యమని కొందరు రౌడీలు బెదిరిస్తున్నారట. ఇతను హోటల్ పక్కనే ఎవరో లోకల్ లీడర్‌ట, అతను కొత్తగా ఓ హోటల్ పెట్టాడట.



అయితే అయ్యర్ హోటల్ వున్నంతకాలం తన హోటల్‌కి ఎవ్వరూ రారని, అందుకని అయ్యర్‌ని హోటల్‌ని మూసెయ్యమని బలవంతం చేస్తున్నాడట. దానికి మన అయ్యర్ వినకపోయేసరికి గూండాలతో దాడి కూడా చేయించాడట. వాళ్లు అతని హోటల్ చిందరవందర చేసి వార్నింగిచ్చి వెళ్లారుట. ఈ విషయం మన సుబ్బారావ్ నాకు ఫోన్ చేసి చెపితే నేను అక్కడికి వెళ్లాను మన అయ్యర్‌తో అన్ని విషయాలు మాట్లాడేను. అతనికి ధైర్యం చెప్పి పోలీస్ కంప్లయింట్ ఇద్దామని చెప్పాను. కానీ దానికి మన అయ్యర్ససేమిరా ఒప్పుకోలేదు. అతను మానసికంగా భయాందోళనలకు గురవుతున్నాడు. ఇక ఈ హోటల్‌ని నడపలేనని ఏడుస్తూ చెప్పాడు. మన ఫ్రెండ్సందరూ వచ్చి ఎంత ధైర్యం చెప్పినా అతను వినడం లేదు. నీకు తెలుసు కదా మనందరికీ అయ్యర్ ఎంత సహాయం చేశాడో! ఈవాళ మన మందరం ఇలా చదువుకొని పెద్ద పెద్ద స్థానాల్లో వుండడానికి అతడు చేసిన సహాయమే కదా కారణం అందుకనీ ఈ ఆపదసమయంలో మనందరం అయ్యర్‌ని ఆదుకోవాలి. నీతో పాటు స్టేట్స్‌లోని మన స్నేహితులందరికీ ఉత్తరాలు రాశాను. వాళ్లు కూడా వస్తున్నారు. నీవు కూడా వీలు చూసుకొని వెంటనే బయలుదేరి రావలెను. ఎలాగైనా ఈ సమస్యని ఎదుర్కోవాలి. అతని హోటల్ మీద ఈగ వాలకుండా చెయ్యాలి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో అతనికి అండగా నిలబడి అతనికి మానసిక ధైర్యం కలిగించడం మనందరి కనీస

బాధ్యత. నీకోసం... ఎదురు చూస్తూ....

- విశ్వనాథం....

సుదీర్ఘంగా విశ్వనాథం రాసిన ఉత్తరం చదివిన మూర్తికి ఏం చెయ్యాలో పాలుపోవడం లేదు. అప్పుడే ఈ ఉత్తరం అతను రాసి పదిరోజులైపోయింది. అయితే ఇప్పటికిప్పుడు ఇండియా వెళ్లడం సాధ్యమేనా?!

కానీ తప్పదు. బయలుదేరి వెళ్లాలి. తమకు ఎంతో సహాయం చేసిన అయ్యర్‌ని ఆదుకోకపోతే మానవత్వం అనిపించుకోదు. తను ఈ రోజు అమెరికాలో ఇంతటి హోదాలో వున్నాడు అంటే అది అయ్యర్ చలవే. కార్లో ఆఫీస్‌కెళ్తూ స్టాఫ్‌కి ఇన్‌స్ట్రక్షన్స్ ఇవ్వసాగాడు. ఇండియా వెళ్లడానికి లేటెస్ట్‌గా ఎప్పుడు టికెట్స్ దొరుకుతాయని అన్ని ఎయిర్‌లైన్స్‌ని ఎంక్వైరీ చెయ్యమని చెప్పాడు. పది నిమిషాల తరువాత అతనికి సమాచారం అందింది ఇరవై రోజుల తర్వాతే వున్నాయని. వెంటనే ఆ తేదీకి రిజర్వ్ చెయ్యమని చెప్పాడు. అతనికి త్వరగా ఇండియా వెళ్లాలని వుంది. అయ్యర్‌కి ఏవైనా సరే చేసి అతన్ని ఆదుకోవాలి. అతనికి తన కాలేజీ జీవితం, అయ్యర్‌తో పరిచయం గుర్తుకు రాసాగాయి.

★★★

అది యూనివర్శిటీ క్యాంపస్. ఆ క్యాంపస్‌లో యూనివర్శిటీ క్యాంటీన్ వున్నా అందులో ఏ విద్యార్థి కనీసం టీ అయినా తాగరు. ప్రొఫెసర్స్ దగ్గర్నుంచి కొత్త విద్యార్థుల దాకా అంతా వెళ్లేది కృష్ణా భవన్‌కే. అలా అని అదేం పెద్ద హోటల్ కాదు. తాటి దూలాలు, సిమ్మెంట్ రేకులతో నిర్మించబడ్డ ఓ సాదా సీదా చిన్న క్యాంటీన్ అని చెప్పొచ్చు. దాని యజమాని అయ్యర్. అందుకే కృష్ణా భవన్ అంటే ఎవరికీ తెలియదు. అయ్యర్ హోటల్‌గానే ప్రసిద్ధి. అయ్యర్ ఎక్కడ నుంచి ఎప్పుడొచ్చాడో ఎవ్వరికీ తెలియదు. కొందరు చిన్నప్పుడే కేరళలో పాల్‌ఘాట్ నుంచి వచ్చి ఇక్కడి హోటల్లో పనిచేస్తూ తర్వాత ఈ హోటల్ పెట్టాడని కొందరు, వాళ్ల నాన్నే హోటల్ పెట్టాడనీ, ఆ తర్వాత అయ్యర్ దాని నిర్వహణ చేపట్టాడని మరి కొందరు కథలు కథలుగా చెప్పుకుంటారు. ఏదైనా ఆ హోటల్‌లో ఇడ్లీ నుంచి పూరీ వరకు, దోశ నుంచి ఊతప్పం దాకా ఏది తిన్నా అమృతమే. ఎప్పుడూ వేడివేడిగా వడ్డించడం అయ్యర్ ప్రత్యేకత. ఆ హోటల్ ఎప్పుడూ మూసి ఎప్పుడు తెరుస్తాడో ఎవ్వరికీ తెలియదు. ఎందుకంటే ఆ క్యాంపస్‌లో పరీక్షల సమయంలో రాత్రి ఒంటిగంట కెళ్లినా ఛాయ్, పకోడి దొరుకుతుంది. మళ్లీ తెల్లతెల్లవారక ముందే చక్కగా స్నానం చేసి నుదుట విభూదితో కౌంటర్ దగ్గర అయ్యర్ ప్రత్యక్షం. ప్రభాత సమయంలో మంద్రంగా వచ్చే తిరుప్పావై వింటూ అగరొత్తుల సువాసనలను ఆఘ్రాణిస్తూ వేడి వేడి ఇడ్లీలను తినడం అక్కడ చాలా మంది విద్యార్థులకు ఎంతో ఇష్టం.

మూర్తి తండ్రి రాజయ్య ఓ పేదరైతు. అతనికి బిఎస్సీలో ప్రథమ శ్రేణి రావడంతో యూనివర్శిటీలో ఎమ్మెస్సీ సీటు మెరిట్‌లో వచ్చింది. మొదట్లో చదివించడం కష్టమైనా ఊరి వాళ్లందరూ తన కొడుకు తెలివైనవాడని చెప్పడంతో రాజయ్యకు జాయిన్ చెయ్యక తప్పింది కాదు. జాయిన్ అయిన తరువాత కాలేజీకి దగ్గర్లోనే ఒక రూమ్ తీసుకున్నాడు మూర్తి. టిఫిన్, భోజనం అందరి విద్యార్థుల్లాగే అయ్యర్ హోటల్లోనే. అక్కడి టిఫిన్, భోజనం అతనికి బాగా నచ్చాయి. ముఖ్యంగా రుచి కన్నా అయ్యర్, అతని భార్య చూపే ఆప్యాయత నచ్చేది. అయ్యర్‌కి ఒక కొడుకు, కూతురు. వాళ్లు కూడా స్కూలు నుంచి వచ్చిన తరువాత హోటల్ పనిలో తండ్రికి సహాయం చేసేవారు.

మొదటి నెల తరువాత మూర్తికి ఇంటి నుంచి మనీ ఆర్డర్ రావడం లేటయ్యింది. డబ్బులివ్వకుండా తినడం, మూర్తికిఇబ్బందిగా అనిపించింది. తన స్నేహితులు విశ్వనాథం, శేషులనడిగాడు. కానీ వాళ్ల దగ్గర కూడా లేకపోవడంతో ఏం చెయ్యాలో తోచక క్లాసులవ్వగానే తిన్నగా రూమ్ కొచ్చి కాసిన్ని మంచి నీళ్లు తాగి మళ్లీ మధ్యాహ్నం కాలేజీకి వెళ్లిపోయాడు. సాయంత్రం ఆకలి కావడంతో అయ్యర్ హోటల్‌కి వెళ్లి టీ తాగుదామని వెళ్లాడు. అప్పుడు అయ్యర్ మూర్తిని చూసి దగ్గరకొచ్చి అడిగాడు. ''ఏం మూర్తి బాబూ! మధ్యాహ్నం భోజనానికి రాలేదేం?''

''నాక్కొంచెం ఒంట్లో బాగులేదు అయ్యర్. అందుకని భోజనం చెయ్యాలని అనిపించలేదు.''

''నువ్వు అబద్ధం ఆడుతున్నావ్ మూర్తీ! నాకు డబ్బులు ఇవ్వలేకపోయినందుకే నువ్వు రాలేదు. నిజమా? కాదా?'' రెట్టిస్తూ అడిగాడు అయ్యర్.

మూర్తి మౌనం వహించాడు. మళ్లీ అయ్యరే అన్నాడు.

''చూడు మూర్తీ! నాకు డబ్బు ఎప్పుడూ ప్రధానం కాదు. పిల్లవాళ్ల చదువే ముఖ్యం. ఇక్కడ ఇంతమంది భోజనం చేస్తున్నారు. వాళ్లలో ఎవరినైనా అడుగు. ఈ విషయం నీకు చెపుతారు. నువ్వింకేం మనసులో పెట్టుకోక రాత్రి నుంచి భోజనానికి రా. డబ్బు లదేముంది? వచ్చినప్పుడు ఇద్దువుగాని. నీ పేరు కింద పద్దుల పుస్తకంలో జమ రాస్తుండు. అన్నింటికన్నా ముఖ్య విషయం నువ్విక్కడకొచ్చింది చదువు పూర్తి చేయడానికి. దీన్ని మరిచి పోకు.'' అయ్యర్ మాటలు మూర్తికి అమృతంలా తోచాయి. అతని కళ్లలో నీళ్లు పెల్లుబికాయి. కళ్లు తుడుచుకుంటూ వస్తానని తలూపేడు. అప్పటినుంచి అతనికి డబ్బు ఒక సమస్య కాలేదు.

ఆర్నెల్ల తరువాత ఒకరోజు మూర్తికి ఇంటి నుంచి పిడుగులాంటి వార్త. తండ్రికి సీరియస్ అని. వెంటనే బయలుదేరి వెళ్లాడు. అప్పటికే తండ్రి కోమాలోకి వెళ్లిపోయాడు. మూర్తికి ఏం చెయ్యాలో తోచని స్థితి. మర్నాడే అతను చనిపోయాడు. అన్ని కార్యక్రమాలు పూర్తి అయ్యేసరికి పదిహేను రోజులు పట్టింది. అప్పటికి అతనికి కాలేజీ గుర్తొచ్చింది. కానీ తను ఇంక చదువు కొనసాగించలేడు. ఎందుకంటే ఇల్లు గడవని స్థితి. తన తండ్రి తన చదువుకై చేసిన ఋణం తీర్చాలి. ఇంటి దగ్గర తల్లి, చెల్లి, తమ్ముడు వీళ్లందరినీ పోషించాలి. వున్న ఆస్తంతా ఒక ఎకరా పొలం. అయినా తను పరీక్షఫీజు కట్టే టైం కూడా అయిపోయింది. అందుకే ఆ విషయం ఆలోచించడం మానేశాడు. అతనికి తన జీవితం తలుచుకుంటేనే బాధగా వుంది. ఆ సాయంత్రం మూర్తి పొలంలో వుండగా దూరం నుంచి అయ్యర్, విశ్వనాథం వస్తూ కనిపించారు. తండ్రి పోయినందుకు వాళ్లిద్దరూ చాలా విచారించేరు. ఆరాత్రి భోజనాలయ్యాక మూర్తిని అడిగాడు అయ్యర్ ''మూర్తి! కాలేజీకి ఎప్పుడొస్తున్నావ్? ఇంటి దగ్గర పనులన్నీ పూర్తయినట్లేనా?''

''లేదు అయ్యర్! నేనిప్పుడు చదువు కొనసాగించే స్థితిలో లేను. చూశావు కదా. మా కుటుంబ పరిస్థితి. చెల్లి, తమ్ముడు చిన్నవాళ్లు. వీళ్లందరి ఆలనా పాలనా చూడాలి. అదీగాక పైచదువులు చదవడానికి ప్రస్తుతం నా ఆర్థిక పరిస్థితి సరిపోదు. అందుకనీ చదువును ఆపేయ్యాలని నిర్ణయించుకున్నాను'' చివరిమాట అంటున్న మూర్తి కళ్లల్లో నీళ్లు చెమ్మగిల్లడం ఆ



ఆధునిక దంతవైద్యం

నోటిని ఆరోగ్యంగాను, పలువరుసను అందంగాను, చిరునవ్వుని ఆకర్షణీయంగా ఉంచుకోవాలని ఎవరికుండదు? అందుకు ఏంచేయాలో, ఎవర్ని కలవాలో చాలా మందికి తెలీదు. సమాజంలో 86% మంది ఏదో ఒకరకమైన దంతసమస్యతో బాధపడుతున్నారని అంచనా!! అదే సమయంలో కేవలం 4% మంది మాత్రమే దంతవైద్యుల్ని కలుస్తున్నారు. కారణం మిగిలినవారికి సమస్యలున్నాయని తెలియకపోవడమే! ఈ అవగాహనా రాహిత్యం నిర్లక్ష్యానికి దారితీస్తుంది. సమస్య ముదిరిన తరువాత చేయాల్సిన చికిత్సలూ పెద్దవవుతాయి. అందుకే దంతవైద్య సేవలో ముందుండే పార్థ ఛారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో మీకు స్పెషలిస్టులచే ఉచిత పరీక్షలు, సలహాలు, పరిష్కార మార్గాలు అందిస్తున్నాం. వారం రోజుల మాత్రమే! సద్వినియోగం చేసుకోండి. ఎక్కడంటే....

పార్థ దంతవైద్యశాల & రీసెర్చి సెంటర్

హైదరాబాదు
స్కాల్ స్క్వేర్ కాంప్లెక్స్, లిబర్టీ సెంటర్, టి.టి.డి. కళ్యాణ మండపం ప్రక్కన, హిమాయత్ నగర్, ఫోన్: 040-23222200, 65991010

తిరుపతి
శ్రీనివాసం కాంప్లెక్స్ ఎదురుగా, పెద్దకాపులేఅవుట్, ఫోన్ : 0877-2250105, 2250555




వెన్నెట్లో స్పష్టంగా చూశాడు అయ్యర్.

"మూర్తీ! ఈ విషయాలేవీ నువ్వు ఆలోచించకు. ఇప్పుడు చదువు మానెయ్యడం నీ భవిష్యత్‌కి మంచిది కాదు. ఫీజు గురించి నువ్వు ఆందోళనపడకు. అది అయ్యర్ ఎప్పుడో కట్టేశాడు. ఇంక నువ్వేం మాట్లాడకుండా రేపు బయల్దేరు. మిగతా విషయాలు తరువాత మాట్లాడుకుందాం" మధ్యలో కల్పించుకొని చెప్పాడు విశ్వనాథం.

"అవును మూర్తీ! నువ్వు డబ్బు గురించీ బెంగపడకు. నీ చదువు పూర్తయిన దాకా నా హోటల్‌లో భోజనం చెయ్యి. ఉద్యోగం వచ్చిన తరువాత అణా పైసలతో సహా తీర్చేద్దువుగాని. చదువు పూర్తి చేసి మీ నాన్న కలలని నిజంచెయ్యి" అయ్యర్ మూర్తి చేతిని నొక్కుతూ అన్నాడు. అలా మూర్తి చదువు పూర్తవడానికి అయ్యర్ చేసిన సహాయం కారణమైంది.

మూర్తి ఆలోచనల్లోంచి తేరుకున్నాడు. అనుకున్న ప్రకారం ఇరవై రోజుల తరువాత ఇండియాకి బయలుదేరాడు.

★★★

విమానాశ్రయానికి మూర్తిని రిసీవ్ చేసుకునేందుకు విశ్వనాథం, శేషు, రాజు వచ్చారు. ఆ తరువాత ముగ్గురితో కలిసి మూర్తి యూనివర్సిటీకి బయలుదేరాడు. మూర్తికి త్వరగా అయ్యర్ దగ్గరకు వెళ్లాలని వుంది. కారులో ఎవ్వరూ మాట్లాడ్డంలేదు. వాళ్ల మధ్య నిశ్శబ్దం. కారు మెల్లగా సాగిపోతోంది. మూర్తి మారిపోయిన పట్టణాన్ని చూస్తున్నాడు. మరో అర గంటకి యూనివర్సిటీ చేరుకున్నారు వారు. కానీ హోటల్ మూసి వుండడాన్ని దిగిన తరువాత చూశాడు మూర్తి. ఆశ్చర్యంగా విశ్వనాథం వంక చూశాడు.

"అవునురా మూర్తీ! ఆరునెలల కిందట ఈ గొడవలు మొదలయ్యాయట. వాడు లోకల్ లీడరే కాకుండా ఇక్కడ మంత్రికి బంధువు కూడానట. కొత్తగా వచ్చిన వైస్ ఛాన్సలర్ ప్రోద్బలంతో వాడు ఈ సాహసానికి పూనుకున్నాడట. రాను రాను వాడి వేధింపులెక్కువయ్యాయి. ఒకరోజు అయ్యర్ కొడుకుని కిడ్నాప్ చేసి ఈ వూరు నుంచి వెళ్లకపోతే అతడిని చంపేస్తామని బెదిరించారట కూడా. ఇంకోసారి హోటల్ సాంబార్‌లో బొద్దింకలొచ్చాయని కొందరు విద్యార్థులు పోలీస్ స్టేషన్‌లో కంప్లయింటిచ్చారు. ఇలా ఒకటని కాదు చాలా విధాలుగా బెదిరించాడతను" విశ్వనాథం చెప్పుకుపోతున్నాడు.

"మరీ విషయాలు ముందుగానే మాకెందుకు చెప్పలేదు విశ్వం" అసహనంగా అడిగాడు మూర్తి.

"నీకు ముందు నుంచి తెలుసు కదురా అయ్యర్ సంగతి. ఎవ్వరినీ సహాయం చెయ్యమనీ అడిగే మనస్తత్వం కాదు అయ్యర్‌ది. మాకందరికి తెలిసి ఇక్కడికొచ్చేసరికి అయ్యర్ మానసికంగా కృంగిపోయివున్నాడు. రోజూ గొడవలు... తాగి వచ్చి వాళ్లు చేసే అల్లరి, దాని వల్ల స్టూడెంట్స్ పడే బాధలు ఇవన్నీ అతను తట్టుకోలేకపోయాడు. అందుకే నీకు ఉత్తరం రాసిన రెండు రోజులకే ఎవ్వరికీ చెప్పకుండా పెళ్లాం పిల్లలతో ఎక్కడికో వెళ్లిపోయాడు. సరిగ్గా ఈ రోజుకి నలభై రోజులైంది అతనిక్కడ్నించి వెళ్లిపోయి. ఎక్కడా అతని అడ్రస్ దొరకలేదు" శేషు బాధగా అన్నాడు.

మూర్తికి గుండె బరువెక్కింది. ఏం చెయ్యాలో తోచని నిస్సహాయస్థితి. తమని ఆదుకున్న చేతుల్ని రక్షించలేని స్థితిలో తాము... ఎందుకు తామందరం?! అందరికీ అతను దారి చూపాడు. మరెందరికో అన్నం పెట్టాడు. తన ప్రేమను, కరుణని పంచిపెట్టాడు. కానీ అతనికి అవసరం వచ్చినప్పుడు ఇవేమీ అతన్ని రక్షించలేకపోయాయి. మూర్తి మరో మూడు రోజులు అక్కడే వుండి అతడి ఆచూకి కోసం విశ్వప్రయత్నం చేశాడు. స్నేహితులందరూ ఎవరికి వారు వెనుదిరిగి పోయారు. మూర్తికి మర్నాడు ఉదయం ఫ్లైట్‌కి అమెరికా వెళ్లడానికి టికెట్ రిజర్వ్ చేయబడింది. అతనికెందుకో తన ఊరిని చూడాలనిపించింది. చూసి వెంటనే వచ్చేయాలి. ఇప్పుడు ఊళ్లో ఎవ్వరూ లేరు. అమ్మ తనతోటే వుంటోంది. చెల్లెలికి పెళ్లయిపోయింది. తమ్ముడు ఆస్ట్రేలియాలో వుంటున్నాడు. అయినా సరే తను పుట్టి పెరిగిన ఊరిని చూడాలనిపించింది. అందుకే టాక్సీలో బయలుదేరి సాయంత్రానికి ఆ ఊరు చేరుకున్నాడు. ఆ రాత్రి తన మేనమామింట్లో బసచేసి మళ్లీ తెల్లవారకముందే టాక్సీలో బయలుదేరాడు. ఏడుగంటల ప్రాంతంలో టాక్సీ హైవే చేరుకుంది. తన ఫ్లయిట్ పది గంటకి, ఇంకా ఎయిర్‌పోర్ట్ చేరడానికి రెండు గంటలు పడుతుంది. టైమ్ చూసి డ్రైవర్‌తో చెప్పాడు. "బాబూ! ఇక్కడ దగ్గరలో ఏదైనా హోటల్ వుంటే ఆపు. కాస్త టిఫిన్ చేసి వెళదాం."

కొద్దిసేపటికి ఒక జంక్షన్ వచ్చింది. డ్రైవర్ టాక్సీని పక్కకు తీసి ఆపి దగ్గరలో వున్న కిళ్లీ బడ్డీలో వాకబు చేశాడు – దగ్గరలో ఏదైనా హోటల్ వుందా? అని.

"ఇక్కడికి అయిదు కిలోమీటర్ల దూరంలో కొత్తగా ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు తెరిచారు బాబూ! ఈ మధ్యనే ఒక కొత్త హోటల్ తెరిచారెవ్వరో. అక్కడ ఫలహారాలు, భోజనాలు చాలా బాగుంటున్నాయని అందరూ చెప్పుకుంటున్నారు. మీకు టిఫిన్ కావాలంటే అక్కడికెళ్తేనే మంచిది" అని ఆ బడ్డీవాడు చెప్పాడు.

డ్రైవర్ తిరిగి టాక్సీని స్టార్ట్ చేసి పోనిచ్చాడు. అతను చెప్పినట్లుగానే ఐదు నిమిషాల్లో అది ఆ కాలేజీలున్న ప్రదేశానికి చేరుకుంది. చాలా పెద్ద కాలేజీలు అవి. విశాలమైన భవనాలతో ఆ ఏరియా అంతా చాలా బాగుంది. ఓ పక్క హాస్టల్స్, మరో పక్క హాస్పిటల్స్, ఇంజనీరింగ్ కాలేజీ లాబరేటరీస్ ఇంకో వైపు.... ఎక్కడ చూసినా విద్యార్థులే కనిపిస్తున్నారు. ఇంతలో డ్రైవర్ టాక్సీని ఓ హోటల్ ముందు ఆపి "సార్! అతను చెప్పింది ఈ హోటల్ గురించే" అన్నాడు. మూర్తి కారు దిగి ఆ హోటల్‌ని చూశాడు. వెంటను అతను సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యాడు. దాని పేరు కూడా 'కృష్ణాభవన్' అని రాసి వుంది. కింద అయ్యర్ హోటల్ అని బ్రాకెట్లో రాసి వుంది. ఒక్క ఉదుటున హోటల్ చేరుకున్నాడు. కొంపతీసి ఈ హోటల్ తమ అయ్యర్‌ది కాదు కదా అన్న సంశయం కలిగిందతనికి. ఆ ఆలోచన రావడంతోనే ఉద్వేగానికి లోనయ్యాడు అతను. లోపల హోటల్ అంతా విపరీతమైన రద్దీగా వుంది. కూర్చోవడానికి టేబుల్స్ కూడా లేని పరిస్థితి ఉందక్కడ. అందరూ వేడి వేడి పదార్థాలు తృప్తిగా ఆరగిస్తున్నారు. అప్పుడు చూశాడతను కౌంటర్ వైపు....కౌంటర్‌లో ప్రశాంతంగా అమాయక చిరునవ్వుతో అయ్యర్ కూర్చొని వున్నాడు. తమ అయ్యర్. అక్కడ రద్దీగా వుండడంతో అతను మూర్తిని చూసే అవకాశం లేదు. అంటే అయ్యర్ అక్కడ మాయమై ఇక్కడ ప్రత్యక్షమయ్యాడన్నమాట. అతను ఆనందంతో ఉబ్బితబ్బిబ్బు అవుతున్నాడు. అవును అయ్యర్ లాంటి మంచి మనిషి ఎక్కడ బ్రతకలేడు? అతనిది అమృత హస్తం! మనసు మణిపూస. అతనికెవ్వరూ అన్యాయం చెయ్యలేరు.

మూర్తికెందుకో అతన్ని కలవాలనిపించలేదు. అతనిక్కడ ప్రశాంతంగా వున్నాడు. మళ్లీ అక్కడికి తీసికెళ్తే అతనికన్నీ కష్టాలే... ఎక్కడో అక్కడ అయ్యర్ క్షేమంగా వున్నాడు. అతని సుఖశాంతులే తమకు ముఖ్యం. ఇక్కడ కూడా తనలాంటి పేద విద్యార్థులను తన ఆపన్న హస్తంతో ఆదుకుంటాడతను. అతని నీడలో ఎందరో పేదవాళ్లు సేదతీరుతారు. అతనో మంచి గంధం చెట్టు లాంటివాడు.

మూర్తి ముఖానికి మఫ్లర్ చుట్టుకొని అయ్యర్‌కి కనిపించకుండా చివర బెంచీలో కూర్చుని అమృతం లాంటి ఆ టిఫిన్ తృప్తిగా ఆరగించాడు. దాన్ని ప్రసాదంలా కళ్లకద్దుకున్నాడు. తరువాత బిల్లు చెల్లించమని డ్రైవర్‌కి డబ్బులిచ్చి బయటకొచ్చాడు. వస్తూ వస్తూ అయ్యర్‌ని మరోసారి తృప్తిగా చూసి వెనుతిరిగాడు...

ఇప్పుడతనికి ప్రశాంతంగా వుంది. తన వచ్చిన పని పూర్తయినట్లు అతను భావించాడు. టాక్సీ స్పీడుగా ఎయిర్ పోర్టు వైపు పరుగుతీస్తోంది. ★